క్లుప్తంగా

విత్తనాల పంపిణీ

బిజినేపల్లి: జాతీయ ఆహార భద్రతా పథకంలో యాసంగి సాగు నిమిత్తం కదిరి లేపాక్షి 1812 రకం వేరుశనగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి నీతి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలానికి 342 బస్తాల విత్తనాలు వచ్చాయని, 100శాతం రాయితీతో ఆయా క్లస్టర్లకు సమానంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఏఈఓలకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్ ఇవ్వాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



మన్ననూర్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని సాయిధ్యాన పిరమిడ్ కార్యదర్శి సంబు భాస్కర్, వెంకటరమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించి పిరమిడ్ ధ్యాన సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత పుస్తకాలను పంపిణీ చేశారు. అచ్చంపేటలో ధ్యాన మందిరం నిర్వహణ ఖర్చుల నిమిత్తం వెంకటరమణ, సంబు శోభ దంపతులు రూ.11,016 విరాళం అందజేశారు. శ్రీధర్‌రావు, సాయిశంకర్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

కొల్లాపూర్: పట్టణంలోని రాధామురళి గోపాలకృష్ణ మందిరం అభివృద్ధి నిమిత్తం గురువారం యాదవ జాగృతిసేన నాయకుడు అప్పల మాసయ్యయాదవ్ రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మాసయ్యను సంఘం నాయకులు పూలమాల, శాలువాతో సన్మానించారు. కౌన్సిలర్ రాముడుయాదవ్, ఎల్లయ్యయాదవ్, బద్దుల చంద్రయ్య, శ్రీనుయాదవ్, కొమ్ము వెంకటేష్, దాసరి పెద్ద బిచ్చన్న, ఈశ్వరయ్య, రాముడు పాల్గొన్నారు.

వెన్నచెర్ల వాసికి డాక్టరేట్



కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్లకు చెందిన ముల్తుంకార్ శంకర్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆరెకటికల అభివృద్ధి, మెడికల్ విభాగంలో శంకర్ అందిస్తున్న సేవలకుగాను తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ వేణుగోపాలాచారి చేతులమీదుగా డాక్టరేట్‌ను అందజేశారు. చెన్నైలోని నారీ ఫౌండేషన్ సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

న్యాయవాదికి పరామర్శ



బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన న్యాయవాది రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా కోర్టు న్యాయవాదులు గురువారం అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అతడి ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు వివరించి, మరింత ఆర్థికసాయం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, రాజశేఖర్, కాంతారావు, శ్రీనివాసులు గుప్తా, శేఖరయ్య, ఎం.పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్ డీఈ హఠాన్మరణం



భాషునాయక్ (ఫైల్)

అచ్చంపేట రూరల్/బల్మూర్: మండలంలోని అంబగిరికి చెందిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ భాషునాయక్ (56) గురువారం హఠాన్మరణం చెందారు. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన ఆయన.. పీఆర్ ఏఈగా సుదీర్ఘకాలం పనిచేశారు. నాలుగేళ్లుగా డీఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అచ్చంపేట పట్టణంలోని అద్దె భవనంలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు తెలిపారు. కాగా భాషునాయక్ భార్య సుభద్ర ప్రస్తుత అంబగిరి గ్రామ సర్పంచ్‌గా పని చేస్తున్నారు. అతడి మృతితో స్వగ్రామంతో పాటు మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజలకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే ఉద్యోగి మరణించడం బాధాకరమన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, గోపాల్‌నాయక్, లోక్యానాయక్ ఉన్నారు.



తెలకపల్లి కేకేరెడ్డి పాఠశాలలో..



తాడూరు మండలం గుంతకోడూరు పాఠశాలలో..



జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో..

ఘనంగా బతుకమ్మ సంబరాలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి దసరా సెలవుల సందర్భంగా పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఆడిపాడారు. సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాస్టర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: తెలంగాణ సంస్కృతిని చాటే బతుకమ్మ సంబరాలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కనులపండువగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల, ప్రాథమిక పాఠశాలలతో పాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. వేడుకల అనంతరం చెరువులు, కేఎల్‌ఐ కాల్వల్లో నిమజ్జనం చేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, అనిత, పాషా, కిశోర్, రమేష్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

కొల్లాపూర్: కోడేరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రగతి విద్యానిలయం, బ్లూమింగ్ బర్డ్స్, అక్షరాభ్యాస పాఠశాలల విద్యార్థులు బతుకమ్మ ఆడారు. అనంతరం ఊర చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, మాయ, సురేష్, రఫీ, రామకృష్ణ, నాగరాజు, మమత, శోభ, లలిత, గోపి, స్వప్న, భార్గవి, నిఖిత, స్వాతి పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రభ, ఆనంద్, సుధాకర్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం విజేందర్‌సింగ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడి పాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాగర్, రమేష్ పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని కొట్ర, కేజీబీవీ తదితర పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులు, కాల్వల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ స్రవంతి, లలిత, శోభన్‌బాబు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని లిటిల్‌బర్డ్స్ స్కూల్‌లో విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి ఆడి పాడారు. అనంతరం కోతినేని చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రఘుపతిరెడ్డి, డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రతిరాజు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం పాఠశాలలో..



వెల్దండ కేజీబీవీలో..



పెద్దకొత్తపల్లి లిటిల్‌బర్డ్స్ స్కూల్‌లో..



కోడేరులో..



ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్‌లో..

దోమల నివారణ మందు పిచికారీ

లింగాల: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుధాకర్‌లాల్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఎర్రపెంటలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి అశోక్ ప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని చెంచులకు సూచించారు. కార్యక్రమంలో నర్సింగం, లింగమ్మ, శ్రీనివాసులు, రాఖేష్, శివ, యుగంధర్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కల్వకుర్తి టౌన్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. పట్టణంలోని 8, 9 వార్డుల్లో గురువారం సీసీరోడ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శివకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తిరుపతికి బయల్దేరిన భజన మండలి

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన శివరామ బ్రహ్మేంద్రస్వామి భజన మండలి సభ్యులు గురువారం తిరుమల తిరుపతి దేవస్థానానికి బయల్దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ ఆహ్వానం మేరకు ఈనెల 14న తిరుమలలో హరినామ సంకీర్తనలు ఆలపించనున్నట్లు రామాచారి, ఉమాపతాచార్యులు తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పలుచోట్ల చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గురువారం బాధితులకు ఎస్‌ఐ రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన సిబ్బంది దావూద్‌ను ఎస్‌ఐ అభినందించారు. ఎస్‌ఐ రాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు కాల్ సెంటర్



కొల్లాపూర్ కాల్‌సెంటర్ వద్ద మున్సిపల్ ఉద్యోగులు



తెలకపల్లిలో పోస్టర్ తొలగిస్తున్న సిబ్బంది

కొల్లాపూర్: ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకుగాను కొల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ వెల్లడించారు. గురువారం నుంచి కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను మున్సిపల్ ఉద్యోగులు స్వీకరించి, సంబంధిత అధికారులకు తెలియజేస్తారని వివరించారు. ఫిర్యాదుల స్వీకరణకు ఉద్యోగులు అఖిల్, సతీష్, రవిలను నియమించినట్లు తెలిపారు.

పోస్టర్ల తొలగింపు

తెలకపల్లి: ఎన్నికల నిబంధనల మేరకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన వాల్‌పోస్టర్ల తొలగింపు కొనసాగుతోంది. వాల్ రైటింగ్‌లను తుడిపేయడంతో పాటు పార్టీల జెండా దిమ్మెలకు సున్నం వేస్తున్నారు. జెండాలు, గుర్తులు కనిపించకుండా ముసుగు కప్పుతున్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

పాన్‌గల్: శాసనసభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ వేణు ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీ నేతలకు సూచించారు. గురువారం మండలంలోని రేమద్దులలో వారు పర్యటించి ఫ్లెక్సీలు, గోడలపై రాతల తొలగించే పనులు పరిశీలించారు. ఎన్నికల నిబంధనలను తప్పక పాటిస్తున్నామని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, పార్టీ జెండా కట్టల వద్ద గుర్తులకు ముసుగులు కప్పి ఉంచడం, గోడలపై రాసిన రాతలకు రంగులు వేయించినట్లు వారు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్, చింతకుంట ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవులను ప్రైవేట్ పాఠశాలలు తప్పక పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను విస్మరించే పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీరాములు, నారాయణ, కలమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఉదారత



ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కల్వకుర్తి: అకాల మరణం చెందిన ఆర్టీసీ ఉద్యోగి కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచి ఉదారత చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో పనిచేసే కండెక్టర్ కరుణాకర్ ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబ దీనస్థితిని చూసిన తోటి ఉద్యోగులంతా కలిసి చందాలు వేసుకున్నారు. గురువారం డిపోలో కరుణాకర్ సంతాప సభ నిర్వహించి, డిపో మేనేజర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష 70వేల ఆర్థిక సాయం అందజేశారు. అతడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, పిల్లల చదువులకు తమవంతు సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మైసమ్మ రోడ్డు

- గుంతల దారితో భక్తుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

కొల్లాపూర్ (పెద్దకొత్తపల్లి): మండల కేంద్రం నుంచి నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. దారి మొత్తం గుంతలమయం కావడంతో వాహనదారులు, భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ప్రతి ఆదివారం నాయినోనిపల్లి మైసమ్మను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది వాహనాల్లో భక్తులు వస్తుంటారు. మండల కేంద్రం నుంచి మైసమ్మ ఆలయం వరకు రోడ్డు అధ్వానంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీగలపల్లి క్రాస్‌రోడ్డు నుంచి యాపట్ల క్రాస్‌రోడ్డు వరకు 21 కి.మీ. దూరం బీటీ నిర్మాణానికి రూ.21కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ తీగలపల్లి క్రాస్‌రోడ్డు నుంచి నాయినోనిపల్లి మైసమ్మ దేవత వద్దకు మాత్రమే రోడ్డు వేసి వదిలివేశారు. నాయినోనిపల్లి గ్రామశివారులోని కల్వర్టు వద్ద బీటీ నిర్మించకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా పెద్దకార్పాముల సమీపంలో బీటీరోడ్డుపై పెద్ద గోతి ఏర్పడింది. గోతిలో వర్షపునీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గుంతలను గమనించక కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మైసమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతి

మరమ్మతు చేయించాలి..



పెద్దకార్పాముల వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. గుంతను గమనించక చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేయించాలి. మైసమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసే బాధ్యత ఎండోమెంట్ అధికారులు తీసుకోవాలి.

– తిరుమల్, సాతాపూర్

పనులు పూర్తి చేయాలి..



మైసమ్మ దేవత నుంచి యాపట్ల వరకు కంకర వేసి వదిలేశారు. రోడ్డుపై బీటీ వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అక్కడక్కడ రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డును ఎవ్వరు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలి.

– నాగరాజు, పెద్దకొత్తపల్లి

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



బ్యాటింగ్ చేస్తున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో క్రీడాకారులకు కొదవలేదని, క్రీడల్లో మరింత ప్రావీణ్యం పెంచుకొని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సూచించారు. పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం అచ్చంపేట ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు బ్యాటింగ్ చేశారు. టోర్నీలో ఏడు టీంలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు మనోహర్‌ప్రసాద్, రమేష్‌రావు, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర ప్రారంభం

బల్మూర్: పీజేఆర్ ఆధ్వర్యంలో మండలంలోని గోదల్ నుంచి శ్రీశైల క్షేత్రానికి చేపట్టిన ఆశీర్వాద సైకిల్‌యాత్రను విప్ గువ్వల బాలరాజు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గువ్వల అఖండ మెజార్టీతో గెలుపొందాలని కాంక్షిస్తూ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో భూషన్న, ఎర్రన్న, మనోహర్, భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, చుక్కారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అంకులయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభం



అవగాహన కల్పిస్తున్న రావేప్ విద్యార్థులు

తెలకపల్లి: చిరుధాన్యాల సాగుతో రైతులకు లాభం చేకూరుతోందని రాజేంద్రనగర్, పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మండలంలోని రాకొండలో గురువారం రైతులు, మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేల స్వభావానికి అనుగుణంగా పంటలు పండించాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అదేవిధంగా మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. వ్యాధుల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రావేప్ విద్యార్థులు అమృత, శివ, శ్రావణి, సుమాంజలి, నాగవర్ష, నర్మద పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి

తాడూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శిర్సవాడ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పని చేసిన తిరుపతయ్య బదిలీ అయిన సందర్భంగా గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. అనంతరం జీహెచ్‌ఎం తిరుపతయ్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

లింగాల: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధి కటకం వెంకట్‌రాజు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం 15మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు రాఘవేందర్ సహకారంతో జిల్లాలో 235 మంది విద్యార్థులకు రూ.70వేల విలువజేసే మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, క్లబ్ సభ్యులు శ్రీనివాసులు, అస్రఫ్, ఆర్‌ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.